క్లుప్తంగా

నిరసన

విజయనగరం టౌన్: ప్రైవేట్ సంస్థలతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేస్తే సహించేది లేదని విజయదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ (ఏఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ) అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వైవిధ్యం కొత్త ఆలోచనలను స్వీకరిస్తుంది

విజయనగరం అర్బన్: వైవిధ్యం ఉన్న వారు కొత్త ఆలోచనలను స్వీకరిస్తారని.. విద్యార్థి దశ నుంచే అటువంటి వ్యక్తిత్వం అలవరుచుకోవాలని డాక్టర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ హెచ్.లజపతిరాయ్ అన్నారు. జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో 'ఇంక్లూజివిటీ ఇన్ డైవర్సిటీ' అనే అంశంపై సోమవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సంస్కృతులు, భిన్నమైన జీవిత అనుభవాలు కలిగినప్పుడే సమాజం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం ముఖ్య అతిథిని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీజే నాగరాజు, కోఆర్డినేటర్ బిందుమాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ పాల రైతుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంబాబు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విశాఖ డెయిరీ పాల రైతులు

విజయనగరం ఫోర్ట్: విశాఖ డెయిరీ రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పాల రైతుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి. రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆవు పాల సేకరణ తగ్గించి, ధరలో కోత పెట్టిన డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆవు పాల సేకరణ 10 శాతం తగ్గించారని.. గతేడాది నవంబర్ నెలలో లీటరుకు 4 రూపాయలు తగ్గించారని చెప్పారు. రైతుకు న్యాయమైన ధరను అందించకుండా యాజమాన్యం కో ఆపరేటివ్ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతుల అభిప్రాయానికి, ప్రయోజనాలకు వ్యతిరేకంగా కుటుంబ పెత్తనం, ప్రయోజనం కోసం డెయిరీ డబ్బు, ఆస్తులు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. రైతుల చెమటతో నిర్మితమైన విశాఖ డెయిరీ నేడు స్వార్థపరుల అక్రమాలకు అడ్డాగా మారిపోయిందని ఆరోపించారు. డెయిరీని కంపెనీ చట్టం నుంచి సహకార చట్టంలోకి మార్చాలని కోరారు. పాల సేకరణ ధర పెంచడంతో పాటు సంవత్సరానికి మూడు పర్యాయాలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ పాల రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు లోకరవపు ఆదినారాయణమూర్తి, కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, బండారు పెదబాబు, బోదంకి సన్యాసినాయుడు, రాకోడి రాములు, శిరికి సత్యం , గులిపల్లి గంగునాయుడు, ఎన్. గోపాలం, బుగత సునీల్, ఎస్. దేముడు, బంగారు నాయుడు, రవిరాజు కోటీశ్వరావు,పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే పూర్తి చేయాలి

విజయనగరం: నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఎంఎస్‌ఎంఈ సర్వే శతశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే త్వరితగతిన పూర్తి చేస్తే ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్‌ల రుసుం ఈ నెలాఖరు నాటికి శతశాతం వసూలు చేయాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండ పల్లి సాంబమూర్తి, టీపీఆర్‌ఓ సింహాచలం, ఏఓ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

నెల్లిమర్ల: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం సోమవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర మాఘమాస శుద్ధ వసంత పంచమి సందర్భంగా పాఠశాలలో చిన్నారులచే సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు జరిపించారు. విఘ్నేశ్వర పూజ, గాయత్రీ హోమం, పూర్ణాహుతి, సరస్వతీ అష్టోత్తర పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులతో అక్షర స్వీకార కార్యక్రమం జరిపించారు. పాఠశాల ప్రధానాచార్యులు ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శిశుమందిర్ కార్యదర్శి కందర్ప మురళీకృష్ణ, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, ఇందిర బాల, చరిత, శాంతికుమారి, దేవి, అచ్చియ్యమ్మ, లక్ష్మి, విజయకుమారి, అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు

క్యాన్సర్ ఆస్పత్రి మంజూరుకు డిమాండ్

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పెరిగిపోతున్న క్యాన్సర్ రోగులకు ఆధునిక చికిత్స అందించే వంద పడకల క్యాన్సర్ ఆస్పత్రిని ప్రభుత్వం వెంటనే విజయనగరం జిల్లాకు మంజూరు చేయాలని విజయనగరం జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పౌర వేదిక బృందంతో కలిసి పెద్ద చెరువు గట్టున ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి ప్లకార్డులు చూపిస్తూ గంటసేపు మౌన దీక్ష చేశారు. అనంతరం భీశెట్టిబాబ్జీ మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులకు సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా యువతకు గొంతు క్యాన్సర్, మహిళలకు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లు తీవ్రంగా వేధిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ప్రతినిధులు మీనా, స్రవంతి, దవడ కొండబాబు, శ్రీను,జె.ఈశ్వర ప్రసాద్, టి.రామ్మోహన్ రావు, టి.రాజారావు, శ్రీను, రమణ, తిరుపతి రావు, చిరంజీవి, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

దెంకాడ: మండలంలోని జొన్నాడ పైడితల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఆలయ ఆవరణలో దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారి జి.శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదాయం లెక్కించినట్లు ఆలయ ధర్మకర్త జి. శ్రీనివాస్ తెలిపారు. గతేడాది నవంబర్ 14 నుంచి సోమవారం వరకు హుండీ ఆదాయం లెక్కించగా.. 64,109 రూపాయలు వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, సేవకులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



కృష్ణాపురంలో కబ్జా అయిన చెరువును పరిశీలిస్తున్న ఆయకట్టు రైతులు నాగబాబు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కృష్ణాపురం ఊర చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. ఊర చెరువును ఆయకట్టు రైతులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు మొంగం నాగబాబు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రధాన చెరువైన ఊరచెరువును అక్రమణదారులు మట్టివేసి కప్పడంతో పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. చెరువును ఆనుకుని కొంతమంది ఇప్పటికే నిర్మాణాలు కూడా చేశారన్నారు. అలాగే కామేశ్వరి, చిన చెరువులను కూడా ఆక్రమించారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలనలతో ఆయనతో పాటు ఆయకట్టు రైతులు మొంగం నారాయణప్పారావు, పులపా అప్పలరాజు, మొంగం పైడిరాజు , మొంగం లక్ష్మణరావు, పసుపులేటి రమణ, తదితరులున్నారు.

విచారణ

పూసపాటిరేగ: మండలంలోని తమ్మయ్యపాలెం శ్మశానం విషయమై జరిగిన వివాదంపై సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తాడ్డి గోవింద ఇరువర్గాలతో చర్చలు జరిపారు. మత్స్యకార నాయికుడు బర్రి నూకరాజు, ఇప్పటికే భూమిపై సాగులో ఉన్న వ్యక్తులతో మాట్లాడారు. సర్వే నంబరు 112–6లో ఉన్న శ్మశానంపై ఇరువర్గాలకు విచారించారు. గ్రామానికి శాశ్వత ప్రాతిపదికన శ్మశానం, బోట్లు, వలలు ఉంచుకోవడానికి స్థలం కేటాయించాలని మత్స్యకారులు కోరారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను తొలగించి తమకు కేటాయించాలని మత్స్యకారులు కోరారు. ఇప్పటికే ఆయా భూములపై కోర్టు నుంచి స్టేఆర్డర్ తీసుకున్నామని వేరే వర్గానికి చెందిన వ్యక్తులు తహసీల్దార్‌కు తెలియజేశారు. దీంతో సర్వే చేసిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.



ఇరువర్గాలను విచారిస్తున్న తహసీల్దార్ గోవింద

రెండు బుట్టల విధానం తప్పనిసరి

విజయనగరం: మెరుగైన పారిశుధ్యం కోసం రెండు బుట్టల విధానం తప్పకుండా అమలయ్యేలా చూడాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, ట్యాంక్‌బండ్ రోడ్డు, ఎన్‌సీఎస్ థియేటర్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున పర్యటించి పనుల తీరుపై ఆరా తీశారు.ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

మరమ్మతుల పరిశీలన

విజయనగరం: నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం పరిశీలించారు. 56, 34 నంబర్ల సచివాలయ పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఈ టి.రాయల్‌బాబు, ప్రొఫెసర్ మల్లేశ్వరరావు, డీఈ మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విరాళం..



చెక్ అందజేస్తున్న దాత చైతన్యబాబు

విజయనగరం ఫోర్ట్: నగరానికి చెందిన బొత్స చైతన్యబాబు సోమవారం తన జన్మదినం సందర్భంగా లెప్రా సొసైటీకి రూ. పది వేలు వితరణగా అందజేశారు. తన స్వగృహంలో సొసైటీ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు చెక్ అందజేశారు. కార్యక్రమంలో చైతన్యబాబు తండ్రి బొత్స లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రఘువర్మకు ఎస్‌ఎల్‌టీఏ మద్దతు

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీలు ప్రకటించాయి. ఈ మేరకు సోమవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల కమిటీల సభ్యులు రఘువర్మకు మద్దతు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్.మంజుల, గొర్లె త్రినాథరావు, విసిని వసంతరావు, రామకృష్ణమూర్తి, వీఎస్ఎన్ రాజు, కూన రంగనాయకులు రులు పాల్గొన్నారు.

అక్షరాస్యతే అభివృద్ధికి కొలమానం

- వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి



విద్యార్థులకు పలకలు, విద్యా ఉపకరణాలు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి

విజయనగరం: అక్షరాస్యతే అభివృద్ధికి కొలమానమని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి అన్నారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని దాసన్నపేట వద్ద గల ప్రభుత్వ పురపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పలకలు విద్యా ఉపకరణాలు సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్షరాస్యతా శాతం పెరగాలని.. ఏ ప్రాంతంలో అక్షరాస్యతా శాతం ఎక్కువగా ఉంటుందో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ కొత్తలు ఎర్రినాయుడు, క్లబ్ ప్రతినిధి పప్పు విశ్వనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు జి. శారద, సీహెచ్ లక్ష్మి, ఎస్. లక్ష్మి, ఎం. శాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాపిడోను అనుమతించొద్దు..



నిరసన తెలియజేస్తున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు

విజయనగరం పూల్‌బాగ్: ఆటో, క్యాబ్ డ్రైవర్ల పొట్టకొట్టే కార్పొరేట్ సంస్థ రాపిడో అనుమతించొద్దని కనకదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు కోట జంక్షన్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ కో కన్వీనర్ ఎ.జగన్‌మోహన్, ఆటో యూనియన్ నాయకులు బి. పాపారావు, రామునాయుడు మాట్లాడుతూ.. నగరంలో రాపిడోకు అనుమతిస్తే ఉపాధి కోల్పోతామన్నారు. కేరళ తరహాలో (సవారీ యాప్) ప్రభుత్వమే యాప్‌ను నిర్వహించాలని సూచించారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించని ఎడల మార్చి 24న చలో పార్లమెంట్ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆటో, క్యాబ్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పరామర్శ..

దెంకాడ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మోదవలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోని అప్పలనాయుడు కుటుంబాన్ని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు సోమవారం పరామర్శించారు. మృతుడి భార్య రమాదేవి,కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంచి సన్నిహితుడ్ని కోల్పోయామని, అప్పలనాయుడు మృతి పార్టీకి తీరని లోటని బడ్డుకొండ అన్నారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



అప్పలనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా రాస్తారోకో..



కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

పూసపాటిరేగ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఇబ్బంది పాల్జేసిందని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ ఆరోపించారు. సోమవారం స్థానిక జాతీయ రహదారిపై కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో రాష్ట్రానికి గాని, విజయనగరం జిల్లాకు గాని నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. నిత్యావసర ధరలు నియంత్రించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మోసపూరితమైన కేంద్ర బడ్జెట్‌ను దేశ వ్యాప్తంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాళ్లె సూర్యనారాయణ, కోలా రామునాయుడు, ఎల్. శ్రీను, మహేష్, కేశవ, తదితరులు పాల్గొన్నారు.



